ప్రజాశక్తి
గురువారం 10 అక్టోబర్ 2024
5
అనంతపురం

## రైతులందరికీ సూక్ష్మసేద్య పరికరాలు : కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో అవసరమైన రైతులందరికీ సూక్ష్మసేద్య పరికరాలు అందించే ఏర్పాటు చేస్తున్నామని, ఇందు కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ పథకం (ఎపిఎంఐపి)ను జిల్లాలో అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాకు 37,500 హెక్టార్లను లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 36,858 మంది రైతులు 52597.85 హెక్టార్లకు సూక్ష్మసేద్య పరికరాల మంజూరుకోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈ పరికరాలు పొందేందుకు రైతులు తమ సందేహాల నివత్తి కోసం మండలాల్లో పనిచేసే మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్స్‌ను ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

# పప్పుశనగకు ఎదురుచూపులే..!

సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. అడిగిన రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు అందిస్తామని ఆర్భాటంగా ప్రభుత్వం, అధికారులు ప్రకటించినా ఆచరణలో నిర్లక్ష్యం కన్పిస్తోంది. ఎకరాకు 40 కిలోల చొప్పున 5 ఎకరాలున్న రైతుకు పది బస్తాల పప్పుశనగ విత్తనాలను 25శాతం రాయితీతో పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. ప్రకటన బాగానే ఉన్నా ఆచరణలోకి వచ్చే సరికి పంపిణీ కార్యక్రమం అనుకున్న స్థాయిలో రైతులకు మేలు చేయడం లేదు.

- రైతులకు అందని సబ్సిడీ విత్తనం
- విత్తన సమయం ఆరంభమైనా పంపిణీ కాని వైనం
- రసీదులతో సరిపెడుతున్న అధికారులు

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**

పప్పుశనగ సాగు నిమిత్తం ఐదు ఎకరాలున్న రైతుకు పది బస్తాలను సబ్సిడీతో ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే అధికారులు ఐదు బస్తాలతోనే సరిపెడుతున్నారు. ప్రభుత్వం కిలో పప్పుశనగ రూ.94 ధర ఖరారు చేసింది. అందులో 25 శాతం ప్రభుత్వ రాయితీ పోగా రైతు వాటా కింద రూ.70.50 చెల్లించాల్సి ఉంది. ఇదే ధరకు బయట మార్కెట్లో సైతం విత్తనాలు లభిస్తున్నాయి. బయట మార్కెట్‌కు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీ విత్తనాలకు ధరలో పెద్ద వ్యత్యాసం ఉండడం లేదు. దీంతో రైతులు బయట మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. అందులోనూ 5 ఎకరాలున్న రైతుకు 10 బస్తాలు ఇవ్వాల్సి ఉండగా 5 బస్తాలనే ఇస్తున్నారు. ఓ వైపు ధర ఎక్కువగా ఉండడం, మరోవైపు ఇస్తున్న బస్తాల్లో కోత విధించడంతో సబ్సిడీ పప్పుశనగ విత్తన పంపిణీ రైతులకు ఏమాత్రం ఉపయోగ పడడం లేదు. గత ప్రభుత్వంలో విత్తన పంపిణీ సమయంలోనే విత్తన శుద్ధి చేసుకునే మందు కూడా తక్కువ ధరకే పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఇది ఇవ్వడం లేదు.

గత రెండు వారాల నుంచి తాడిపత్రి మండలంలోని చల్లవారిపల్లి, పెద్దపడమల, కొట్టాలపల్లి, కొండేపల్లి తదితర గ్రామాల్లో రైతులు పప్పుశనగ విత్తనాలను సాగు చేస్తున్నారు. అదును దాటుతున్నా సబ్సిడీపై ప్రభుత్వం ఇస్తున్న విత్తనాలు అందకపోవడంతో ఈగ్రామాలకు చెందిన చాలా మంది రైతులు ప్రయివేటు మార్కెట్లో కొనుగోలు చేసి విత్తుతున్నారు. సబ్సిడీ విత్తనాలు ఇచ్చేందుకు అధికారులు ఆయా సచివాలయాల పరిధిలోని రైతులకు పాసుపుస్తకాల ద్వారా వివరాలు తీసుకుని కేవలం రసీదులు మాత్రమే ఇచ్చారు. వీటికి సంబంధించి విత్తనాలు మాత్రం ఇంత వరకు ఇవ్వలేదు. ఈ పరిస్థితుల్లో రైతులు విత్తనాలను బయట కొనుగోలు చేయకతప్పడం లేదు.

బయట మార్కెట్లో పప్పుశనగ విత్తనాలు కొనుగోలు చేసి విత్తుకుంటున్న రైతులు

### బయట మార్కెట్ ధర ఒకేలా ఉంది..

పప్పుశనగకు సంబంధించి బయట మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రాయితీ ఇస్తున్న ధరకు పెద్దగా వ్యత్యాసం లేదు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలనూ అరకొరగానే ఇస్తున్నారు. వీటిని కూడా ఇప్పటివరకు మా గ్రామంలో ఇవ్వలేదు. అధికారులు కేవలం రసీదులు ఇచ్చి కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి రాయితీ పెంచి, పూర్తి స్థాయిలు విత్తనాలను సమకూర్చేలా చర్యలు తీసుకోవాలి.

**జనార్ధన్ నాయుడు, రైతు, చల్లవారిపల్లి గ్రామం.**

### పది బస్తాలు ఇవ్వాలి

ప్రభుత్వం ప్రకటించిన విధంగా పప్పుశనగ విత్తనాలు ఎకరాకు 40 కిలోలు, 5 ఎకరాలకు పది బస్తాలు ఇవ్వాలి. విత్తన పంపిణీలో కొందరు అధికారులు చేతివాటం చూపించి ఐదు ఎకరాల రైతులకు ఐదు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. ఇప్పటికీ ఇంకా రసీదులను మాత్రమే రైతులకు ఇచ్చారు. పంపిణీ ఆలస్యమైతే సాగు చేయడానికి వీలుండదు. సబ్సిడీని మరింత పెంచి రైతులకు తక్కువ ధరకు విత్తనాలు పంపిణీ చేయాలి.

**రాజారామి రెడ్డి, రైతుసంఘం నాయకులు, తాడిపత్రి.**

### విత్తనాలు అందిస్తాం

రైతులకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం. సబ్సిడీ విత్తన పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి మరో ప్రకటన రానుందని, అప్పుడు అడిగిన ప్రతి రైతుకూ విత్తన పంపిణీ చేస్తాం.

**చంగల రాయుడు, తాడిపత్రి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు.**

# సాగునీటి సంఘాల ఎన్నికల జోష్

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

చాలాకాలం తరువాత సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి మంగళవారం నిర్వహించిన సమీక్షలో ప్రకటన చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో మరో ఎన్నికల జోష్ నెలకొంది. ముఖ్యంగా అధికార టిడిపి నేతలు ఈ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. వైసిపి పరిస్థితి ఏ రకంగా ఉంటుందన్నది చూడాల్సి ఉంది. ఎన్నికలు రాజకీయ గుర్తులపై కానప్పటికీ అధికార పార్టీ నేతలు తమ పట్టు నిలుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 375 సంఘాలు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 375 సాగునీటి సంఘాలున్నాయి. ఇందులో 70 సంఘాలు సాగునీటి కాలువల పరిధిలో ఉండగా, చెరువులో 305 సంఘాలున్నాయి. ఇందులో మేజర్ ప్రాజెక్టుల పరిధిలో 48 కాగా, మీడియం పరిధిలో 22 సంఘాలు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 305 ఉన్నాయి. వీటన్నింటికీ త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. టిబిహెచ్ఎల్‌సి పరిధిలో మొత్తం 99 సాగునీటి సంఘాలున్నాయి. హెచ్ఎల్‌సి పరిధి అనంతపురం జిల్లాతోపాటు కర్నూలు, కడప జిల్లాల్లోనూ ఉన్నాయి. వీటన్నింటి నిర్వహణ టిబి హెచ్ఎల్‌సి పరిధిలోనే జరుగుతాయి. జిల్లాల వారీగా చూస్తే అనంతపురం జిల్లాలో 46 సాగునీటి సంఘాలుడగా ఐదు డిస్ట్రిబ్యూటరీ సంఘాలున్నాయి. కర్నూలు జిల్లా పరిధిలో ఆరు, కడప జిల్లా పరిధిలో 46 సంఘాలున్నాయి. ఈనెల 16వ తేదిన నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు 40 రోజుల్లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తవనుందని మంత్రి ప్రకటించారు.

### గ్రామాల్లో సిద్ధమవుతున్న నేతలు

**వైసిపి పాల్గొనేనా ?**

చాలా కాలం తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతుండటంతో రాజకీయంగానూ ఆసక్తికరంగానే మారింది. వైసిపి ఈ ఎన్నికల్లో పాల్గొంటుందా.. లేదా.. అన్నది చూడాల్సి ఉంది. గత సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర ఓటమిని చవిచూసింది. ఆ పార్టీ ఓటమి నుంచి ఇంకా తేరుకోలేదు. ముఖ్య నేతలే ఇంకా పార్టీ కార్యక్రమాల్లో అంటీముట్టనట్టు ఉంటున్నారు.

ఈ నేపథ్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీకి సిద్ధపడే అవకాశాలు చాలా వరకు తక్కువగానే ఉన్నాయి. దీంతో ఈ ఎన్నికలు ఏకపక్షంగా సాగే అవకాశాలే ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా. ఇక అధికారపార్టీ నేతల్లో మాత్రం ఎక్కడలేని ఉత్సాహం నెలకొంది. పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో ఈ ఎన్నికల్లో పోటీ చేసి పదవులు దక్కించుకోవాలని ఉత్సమం చూపుతున్నారు.

# వాతావరణంకు అనుగుణంగా మార్పులు

◆జిల్లాలో పది గ్రామాల్లో సిఆర్‌విడిపి అమలు ◆రెండు రోజుల సదస్సులో ఎఎఫ్ ఎకాలజీ కసరత్తు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

'వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రామ సుస్థిరాభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరముంది' అని ఐఐఎస్‌సి (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు) ప్రొఫెసర్ ఎన్‌హెచ్.రవీంద్ర నాథ్ పేర్కొన్నారు. అనంతపురంలోని ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పది గ్రామాల్లో క్లైమెట్ రిజిలెంట్ విలేజ్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం (సిఆర్‌విడిపి) అమలు చేయాలని తలపెట్టింది. దీని అమలుకు ముందుగా నిపుణులతో అవసరమైన కసరత్తును చేపట్టింది. ఇందులో భాగంగా బుధ, గురువారాలు రెండు రోజుల పాటు ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో సదస్సును చేపట్టింది. ఈ సదస్సు ప్రారంభోపన్యాసం ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి చేపట్టారు. అనంతపురం జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, పంటల సరళి అన్ని అంశాలను విశదీకరించారు. అనంతరం సిఆర్‌విడిపి గురించి ఎఎఫ్ ఎకాలజీ పిఎంఇ లీడ్ బ్రహ్మేశ్వర్ తెలియజేశారు. ఐఐఎస్‌సి ప్రొఫెసర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ కర్బన ఉద్గారాలు, కాలుష్యం పెరిగిన నేపథ్యంలో వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు. ఒకటి, రెండు సంవత్సరాల్లో ఇది పరిశీలిస్తే అర్థం అవుతుందని చెప్పారు. గడిచిన మూడు, నాలుగు దశాబ్దాల గణాంకాలు తీసుకుని పరిశీలిస్తే వాతావరణంలో ఎటువంటి వైవిధ్యం ఏర్పడుతోందన్నది స్పష్టం అవుతుందని తెలియజేశారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ముందస్తు అంచనా వేయగలుగుతున్నప్పటికీ కొద్ది కాలానికి మాత్రమే అందుబాటులో ఉందని చెప్పారు. ఏడాది ముందుగానే వాతావరణ పరిస్థితులను అంచనా వేసి అందుకు అనుగుణమైన నష్ట నివారణ చర్యలు తీసుకునే విధమైన సాంకేతికత ఇంకా అందుబాటులోకి రాలేదని వివరించారు. వస్తున్న మార్పులను అంచనా వేసి అందుకు అనుగుణమైన మార్పులతో వ్యవసాయరంగంలో తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. అప్పుడు నష్టాన్ని చాలా వరకు తగ్గించుకోగలమని వివరించారు. ఐఐఎస్‌సి సభ్యురాలు సుష్మ అనంతపురం జిల్లాలో చోటు చేసుకున్న వాతవరణ మార్పులను అధ్యయనం చేశారు. వీటి వివరాలను ఆమె వివరించారు. అనంతపురం జిల్లాలో తాము పది మండలాలను పరిశీలించినట్టు చెప్పారు. అందులో 45 శాతం వర్షపాతంలో ఏటా వ్యత్యాసం ఉంటోందన్నారు. ఒక్క సంవత్సరం పడితే ఎక్కువైనా పడుతుంది... లేదా సగానికిపైగా తక్కువైనా పడుతోందన్నారు. ఇది పంటలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో తమ సంస్థ ఆధ్వర్యంలో అనుసరించిన సస్యరక్షణ యాజమాన్య పద్ధతుల గురించి శాస్త్రవేత్త యలమందారెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా వ్యవసాయాధికారిణి మల్లేశ్వరమ్మ ఈ సదస్సులో పాల్గొని జిల్లాలో పంటల సరళి, వాతావరణ ప్రభావాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ఎస్‌కె ప్రిన్సిపల్ సైంటిస్టు విజయశంకర్ బాబు, క్రీడా డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, సాంతిక సహాయకులు సికె. గంగూలి, బక్తర్ వలి, ఎఎఫ్ ఎకాలజీ ప్రతినిధులు మురళీకృష్ణ, మీడియా కో ఆర్డినేటర్ ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఎఫ్ ఎకాలజీ నిర్వహించిన సదస్సును ప్రారంభిస్తున్న నిపుణులు

# సిసి రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు సిపిఎం వినతి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

నగరంలోని తిక్క రంగయ్య స్వామి దేవాలయం నుంచి తపోవనం వరకు సిసి రోడ్డు వేయించాలని సిపిఎం నగర ఒకటో కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే 48 డివిజన్ సోమనాథ్ నగర్, ఆర్‌కె.నగర్, రజాక్ నగర్ ప్రాంతాల్లో పర్యటిస్తున్న సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ తిక్క రంగయ్య స్వామి గుడి నుంచి తపోవనం వెళ్లే దారిలో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందన్నారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించి రోడ్లు వేయించాలని కోరారు. రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద బ్రిడ్జిని మరమ్మతు చేయించాలన్నారు. నడుమి వంక చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకట నారాయణ, రామాంజనేయులు, బుల్లె రాజు, గఫూర్, రాముడు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

కరపత్రాలను విడుదల చేస్తున్న ఎన్జీవో సంఘం నాయకులు

## 15న ఎన్జీవో హోంలో ఉచిత వైద్యశిబిరం

**ప్రజాశక్తి -అనంతపురం**

ఈ నెల 15న అనంతపురం ఎన్జీవో హోంలో ఉచిత వైద్య శిబిరాన్ని కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు మర్రిరెడ్డి మనోహర్ రెడ్డి కార్యదర్శి పి.శ్రీధర్ బాబు బుధవారం తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోంలో వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ తేదీ ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కిమ్స్ సవేరా, ఏపీ ఎన్జీవో నగర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిఆర్‌బిఎస్, బిపి, ఈసీజీ, 2డిఎకో పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నాన్ గెజిటెడ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యాక్రమంలో నగర శాఖ కోశాధికారి ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ముగిసిన స్కేటింగ్ పోటీలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఈ నెల 7 నుంచి ప్రారంభం అయిన జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులకు పతకాలను అందించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు నవంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అనంతపురం రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రవిబాల, జిల్లా కోచ్ నాగేంద్ర తెలిపారు.

## తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

**ప్రజాశక్తి -అనంతపురం**

రుద్రంపేట పంచాయతీ చైతన్య కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరికుమార్ తెలిపారు. బుధవారం ఆయన కాలనీలో పర్యటించి నీటి సమస్యపై కాలనీవాసులతో మాట్లాడారు. నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా వెంటనే పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ షెక్షావలిని అదేశించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌ఇన్స్‌పెక్టర్లు వెంకట్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## ధరాభారాలపై గడ్డి తింటూ సిపిఎం నిరసన

**ప్రజాశక్తి-గుంతకల్లు**

పెరిగిన నిత్యావసర సరుకులు, కాయగూరల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద గడ్డి తింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ దసరా, దీపావళి పండుగల వేళల్లో ధరలు పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై ధరాభారాలు మోపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు స్పందించి ధరలు తగ్గించే చర్యలు తీసుకోవాలన్నారు. చౌక ధాన్య డిపోల్లో పేదలకు అన్ని రకాల నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతి ప్రసాద్, జగ్గిలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ, పట్టణ నాయకులు సురేంద్ర, రామునాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, చందు, సుదీప్, సాగర్, వీరేష్, ఐద్వా నాయకులు పూర్ణిమ, భాగ్యమ్మ, శారద, డివైఎఫ్ఐ నాయకులు రాము, లక్ష్మీనారాయణ, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న సిపిఎం,అనుబంధ ప్రజా సంఘాల నాయకులు

## నడిమివంక కాలనీలను నీట మునగనివ్వం

### ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

మురుగు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం నగరంలోని నడిమివంక, మరవవంక పరిసర కాలనీలను మరోసారి నీట మునగనివ్వమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలియజేశారు. మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన 48వ డివిజన్‌లో పర్యటించారు. సోమనాథ్ నగర్, ఆర్‌కె.నగర్, రజక్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. డ్రెయినేజీ, వీధి దీపాల సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. భారీ వర్షాల సమయంలో నడిమివంక నుంచి నీరు ఇళ్లలోకి వస్తోందని, దీనివల్ల చాలాసార్లు నష్టపోయామని తెలిపారు. వీటిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇప్పటికే నడిమివంక, మరవవంక కాలువలకు రిటైనింగ్ వాల్‌తో పాటు డ్రెయినేజీల ఎత్తు పెంచే విధంగా 124 కోట్లతో అంచనాలు వేసినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. పార్కుల అభివృద్ధికి త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నాగభూషణ, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, తెలుగుత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, టిడిపి నాయకులు నరేంద్ర చౌదరి, శ్రీనివాస్ చౌదరి, కృష్ణ, నాగేంద్ర, కృష్ణారెడ్డి, గుర్రప్ప, వాసు, మహేశ్వరి, జావిద్, తనీష్‌తో పాటు జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## రుణమిస్తే చేయి తడపాల్సిందే...!

**ప్రజాశక్తి-కుందుర్పి**

మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లోన్(రుణం) ఇప్పిస్తే ఐకెపి అధికారులు, యానిమేటర్లకు మామూళ్లు ఇవ్వాల్సిందేనా అని వికలాంగుల సంఘం సభ్యులు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. పలువురు విలేకరులతో మాట్లాడుతూ చంద్రోదయ వికలాంగుల సంఘం సభ్యులకు కుందుర్పి పంచాయతీకి చెందిన ఐకెపి అధికారులు బ్యాంకు నుంచి రూ. 15 లక్షల లోన్ మంజూరు చేయించారు. లోన్ చేసినందుకు, సంతకం పెట్టినందుకు, కంప్యూటర్‌లో ఎక్కించినందుకు, సీసీకి రూ. 500 నుంచి రూ. 1000 దాకా చేయి తడపాల్సిందే అని సంఘం సభ్యులను యానిమెటర్ డిమాండ్ చేయడం బాధాకరమని ఆ సంఘం సభ్యులు లేపాక్షి, సుబ్బరాజు, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వికలాంగుల సంఘం, వికలాంగులనే మానవత్వం లేకుండా లంచం వసూలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే ఇకపై ఏ సంఘం నుంచి మామూళ్లు వసూలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఈ-పంటపై కలెక్టర్ సూపర్‌చెక్

**ప్రజాశక్తి -అనంతపురం**

అనంతపురం మండల పరిధిలోని పూలకుంటలో ఈ-పంట నమోదుపై సూపర్ చెక్‌ను కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ బుధవారం నిర్వహించారు. చియ్యేడు రెవెన్యూ పొలం, పూలకుంట గ్రామం వద్ద రైతు అక్కమ్మకు చెందిన దానిమ్మ తోటలో సూపర్ చెక్ నిర్వహించి, అందులో వచ్చిన డేటాను నిర్ధారించారు. ఈ సందర్భంగా దానిమ్మ పంటను ఎప్పుడు సాగు చేశారు, బోరు ఉందా, నీరు బాగా పడుతోందా అన్న వివరాలను రైతుతో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఎడీఏ రవి, టెక్నికల్ ఆఫీసర్ శంకర్ లాల్, ఎంఎఒ శశికళ, ఎంపిటిసి భాస్కర్ రెడ్డి, ఏఈవో మురళీకృష్ణ, విహెచ్ఎ కవిత, ఎంపిఇఒ శ్రావణి పాల్గొన్నారు.

పంట నమోదుకు సంబంధించి సూపర్ చెక్ చేస్తున్న కలెక్టర్

# తాడిపత్రి అభివృద్ధికి సహకరించండి

## మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి

**ప్రజాశక్తి-తాడిపత్రి**

పట్టణంలో పరిశుభ్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాల ని మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్‌రెడ్డి పట్టణ వాసులకు విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం పట్టణంలోని తన నివాసం లో ఓ వీడియో సందేశం విడుదల చేశారు. చేతులు జోడించి విన్నవిస్తున్నా తాడిపత్రిని అభివృద్ధి వైపు తీసుకుపోదామని కోరారు. కొందరు వ్యక్తులు పట్టణం చుట్టూ ఉన్న బైపాస్ రోడ్ల పక్కన చెత్త చెదారం వదులుతూ అపరిశుభ్రంగా మారుస్తున్నారని, ఇకపై ఈ పద్ధతి మానుకోవాలని సూచించారు. అలాగే నాపరాయి, గ్రానైట్ పరిశ్రమల ప్రాంతంలో వాటి వ్యర్థాలను రోడ్లపై వదులుతూ రాకపోకలకు అసౌ కర్యం కల్పిస్తున్నారని ఇక నుంచి అలా వదిలితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తాడిపత్రిలో కుచించుకుపోయిన రోడ్ల వెడల్పు పనులు చేపడతామన్నారు. కుచించుకుపోయిన కాలువలను వాటి సామర్థ్యం మేరకు విడదీయాల్సి ఉందన్నారు. ఈ విధానంలో స్నేహితులు, బంధువులు ఎవరైనా నష్టపోయినా పట్టణ అభివృద్ధి దృష్ట్యా సహకరించాలని విన్నవించారు.

# జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు 'గేట్స్' విద్యార్థి

**ప్రజాశక్తి-గుత్తి**

జోజిరెడ్డితో వీరశేఖర్

పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ ప్రథమ సంవత్సరం విద్యార్థి వీరశేఖర్ ఖోఖో క్రీడలో ప్రతిభ చాటాడు. అనంతపురం జేఎన్టీయూ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఎన్.బి.కె.ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో వీరశేఖర్ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జేఎన్టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి తెలిపారు. వీర శేఖర్‌ను గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి జి.రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ జోయల్ విజయానంద్ అభినందించారు. జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటాలని వారు ఆకాంక్షించారు.

# రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి-అనంతపురం**

చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నగరంలోని సాయినగర్ రెండో క్రాస్ లో ఉన్న ఏ-1 ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ సౌజన్యంతో బుధవా రం అనంతపురం జిల్లా అండర్-15 ఓపెన్, బాలికల చెస్ ఛాంపియన్‌షిప్ -2024 ఎంపిక పోటీలు నిర్వహించారు. ఓపెన్ విభాగంలో కె.సాయి యశస్, పి.సంజయ్ సాహుల్, జొన్నగడ్డల నితీష్, ధీరజ్, బాలికల విభాగంలో ఎ.సుకృత, షారోన్ బ్లెస్సీ, కాశి నౌమిక, త్రిపద వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గో స్థానాల్లో నిలిచారు. ఈ రెండు విభాగాల్లో టాప్-4 విజేతలు గుంటూరులో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్-15 ఓపెన్, బాలికల చెస్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో అనంతపురం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ గౌరవ చైర్మన్ బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి ఇంటూరి కిషోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్ కుమార్‌నాయుడు తెలిపారు. విజేతలకు టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్, నేషనల్ ఆర్బిటర్ కాశి రవీంద్ర, కోఆర్డినేటర్ గోవిందరాజులు మెడల్స్ అందజేశారు. పోటీలకు ఏ-1 చెస్ అకాడమీ వారు ఆర్గనైజర్లుగా వ్యవహరించారు.

నగరంలో రోడ్డును పరిశీలిస్తున్న మేయర్ వసీం

# రోడ్ల మరమ్మతులు ప్రారంభించండి : మేయర్

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

నగరంలో పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలు పడ్డాయని, త్వరితగతిన మరమ్మతులు ప్రారంభించాలని మేయర్ మహమ్మద్ వసీం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మేయర్ బుధవారం డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డిలతో కలిసి నగరంలోని టవర్ క్లాక్, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, తిలక్ రోడ్డు, ఉమా నగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేయడానికి వెంటనే అంచనాలు తయారు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు మేయర్ సూచించారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయాలని సూచించారు. వారి వెంట ఎస్ఈ భాస్కర్‌రావు, ఈఈ రాధాకృష్ణ, కార్పొరేటర్లు అబూసాలేహ్, కమల్ భూషణ్, తదితరులు ఉన్నారు.

## గర్భిణులకు అవగాహన

**ఉరవకొండ** : మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యాధికారి వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. 31 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వెంకటేష్ నాయక్ గర్భిణులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం, భ్రూణ హత్యలకు పాల్పడడం నేరమని, జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నాగ రంగయ్య, ఎంపిహెచ్ఎస్ శేఖర్, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటేశులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని రాయంపల్లి గ్రామానికి చెందిన వెంకటేశులును ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లాలో బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా, నియోజకవర్గ నూతన కమిటీలను ఎన్నిక చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాయంపల్లి వెంకటేశులు, జిల్లా పార్లమెంట్ డివిజన్ అధ్యక్షులుగా ఎం.రామాంజనేయులు, ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షులుగా భీ.మారెన్న, నియోజకవర్గ యువసేన అధ్యక్షులుగా గుజ్జుల ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులుగా రాయంపల్లి శివ, తదితరులను ఎనున్నకున్నారు. అనంతరం నూతన కమిటీన పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఓబయ్య, కార్యవర్గ సభ్యులు రామ్మూర్తి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రం తనిఖీ

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

మండలంలోని తలుపూరు రైతు సేవా కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర వి.వినోద్ కుమార్ సందర్శించి రికార్డులు, ఉద్యోగుల పనితీరుపై ఆరా తీశారు. ముందుగా కలెక్టర్ తలుపూరు గ్రామ పరిధిలో ఎన్.పరమేశ్వరరెడ్డి, పోతుల కృష్ణ, గోపాల్ రైతుల పొలాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియను సూపర్ చెక్ నిర్వహించారు. ఆ తర్వాత స్థానిక రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ఖరీఫ్-2024 ఈ -పంట నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఎడిఎ రవి, ఏవో సుచరిత, తహశీల్దార్ లక్ష్మినాయక్, ఎంపిడిఒ లక్ష్మీ నరసింహ, టెక్నికల్ ఆఫీసర్ శంకర్‌లాల్, తదితరులు ఉన్నారు.

ఈ-పంట నమోదు ప్రక్రియను సూపర్ చెక్ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

# పని చేసే చోట మానసిక ఆరోగ్యం అవసరం

## మానసిక వైద్యనిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్
## నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



**ప్రజాశక్తి-అనంతపురం**

ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు అంటారు. కానీ మానసిక ఆరోగ్యం లేకుండా అసలు ఆరోగ్యమే లేదు. మానసిక ఒత్తిడి, ఆందోళన లాంటి వాటి వల్ల చిన్న వయస్సులోనే అధిక రక్తపోటు, షుగర్, గుండె పోటు, తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా అక్టోబర్ 10వ తేదీ ప్రపంచ మానసిక ఆరోగ్య దినం నిర్వహిస్తోంది. గణాంకాల ప్రకారం దేశ జనాభాలో 15 శాతం మానసిక ఆరోగ్యంతో బాధపడుతు న్నారు. 2017 గణాంకాల ప్రకారం ప్రతి ఏడుగురు విద్యార్థుల్లో ఒకరికి తేలిక పాటి నుంచి తీవ్రమైన మానసిక రుగ్మతలు ఉన్నాయి. అందువల్ల ఈ వ్యాధులపై అవగాహన పెంచుకుని సరైన చికిత్స పొందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానసిక రుగ్మతలపై అవగాహన పెంచుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఏటా ఒక నేపథ్యం(థీమ్) నిర్ణయిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది థీమ్ 'పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యాన్ని ప్రధానం' చేశారు. ప్రపంచంలో 60శాతం జనాభా ఉద్యోగులుగా ఉన్నారు. వారిలో దాదాపు ఏటా 300 మిలియన్ల మంది ఆందోళన, 280 మిలియన్ల మంది కుంగుబాటు(డిప్రెషన్), తదితర మానసిన వ్యాధులతో బాధపడుతుండగా, సుమారు 7 లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. దీనివల్ల ఉద్యోగుల ఉత్పాదక సామర్థ్యం, పని చేసే రోజులు తగ్గడం ద్వారా దేశ ఆర్థిక స్థితిపై ప్రభావం చూపుతుంది. భారతదేశంలో 73శాతం సంస్థలు ఉద్యోగులకు మానసిక ఆరోగ్యం కోసం కౌన్సిలింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. వీరిలో 71 శాతం సంస్థలు ఉద్యోగుల కుటుంబాలకూ ఈ సేవలు ఇస్తున్నా 19శాతం మంది మాత్రమే వినియోగించుకుంటున్నారు. నిరాశ, ఆందోళన, తదితర మానసిన సమస్యలను మొగ్గ దశలోనే గుర్తిస్తే నివారణ సులభతరం అవుతుంది. ప్రతి ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మానసిక రుగ్మతల కోసం స్క్రీనింగ్, కౌన్సిలింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రధానంగా ఉద్యోగుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడ, పని వేళలు స్థిరంగా ఉండడం, యోగా, మెడిటేషన్ వంటివి చేయించడం, సమయపాలన, ఖచ్చితమైన నిద్ర, మత్తు పానీయాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం వాటిపై ఉద్యోగులకు మానసిక నిపుణుల ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలి.

# కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-నార్పల**

రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బండార శ్రావణిశ్రీ తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే స్థానిక కూతలేరు వంక ఎస్సీ కాలనీ, సుల్తాన్ పేట ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లకు భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేస్తే, కూటమి ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగావతి, ఈవోఆర్డీ శైలజరాణి, టిడిపి నాయకులు వెంకట నరసానాయుడు, జడ్పిటిసి నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, సర్పంచి సుప్రియ, జిసి బాబు, ఆలం నాగార్జున, ప్రతాప్ చౌదరి, పిట్టు రంగారెడ్డి, సుల్తాన్ పేట మహేష్‌నాయుడు, రామాపురం శివకుమార్, ఎస్ఎంసి ఛైర్మన్ ప్రకాష్ నాయుడు, తెలుగు యువత నాయకులు చంద్రబాబు, మాజీ జెడ్పిటిసి జాఫర్‌వలి, మాజీ ఎంపిటీసీ గూగూడు రాజన్న, ఓబులేసు, నరసింహులు, జనసేన నాయకులు గంజికుంట రామకృష్ణ, తుపాకుల విజయభాస్కర్, ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు ఘన స్వాగతం**

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నార్పలకు వచ్చిన ఎమ్మెల్యే బండారు శ్రావణికి బొందలవాడ శివకృష్ణచౌదరి వర్గీయులు నార్పల క్రాసింగ్ వద్ద ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మెల్లంపూటి చంద్రమౌళి, జనసేనపార్టీ నాయకులు కొండిశెట్టి ప్రవీణ్ కుమార్, నరసాపురం రాధాకృష్ణ, రంగాపురం సర్పంచి కుళ్లాయప్ప, బలిజ సంఘం అధ్యక్షులు ఇండ్ల రంగనాథ్, ఇండ్ల రాము, మందల సతీష్ నాయుడు, రాజనాల, చిన్న, సిద్దరాచర్ల నాగభూషణ, బొందలవాడ వెంకటనారాయణ, రమేష్, శివప్రసాద్, రవి పాల్గొన్నారు.

# ఆధునిక వ్యవసాయ సాగుపద్ధతులతో రైతులకు లాభాలు

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

వ్యవసాయంలో ఆధునిక సాగు పద్ధతులతోనే రైతుకు లాభాలు చేకూరుతాయని ఏవో సరిత సూచించారు. ఆమె బుధవారం మండలంలోని పడమటి కోడిపల్లి, ఎరడికెర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులను వివరించారు. అలాగే నూతన వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షల ఫలితాలు, ఆధునిక వ్యవసాయంతో లాభాలు, సేంద్రియ ఎరువుల వాడకం, పంట మార్పిడిపై రైతులకు సూచించారు. కంది, శనగలో తెగుళ్ల నివారణ మందుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సరిత

# కళ్యాణదుర్గంను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గంరూరల్**

అన్న క్యాంటీన్ శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపి

నియోజకవర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దు తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద బుధవారం ఎమ్మెల్యే హార్టికల్చర్ పీడీ, సిబ్బంది, ఎంపీడీవోలు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో హార్టికల్చర్ ద్వారా 3,550 ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకా నికి అనుమతులు వచ్చాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని పండ్ల మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని కోరారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్ర స్థాయిలో సిబ్బంది పని చేయాలన్నారు. ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా ప్రలోబాలకు లొంగకుండా అధికారులు పనిచేయాలన్నారు. ఉపాధి పథకం ద్వారా రైతుల పొలాల్లో పంటకుంటలు ఏర్పాటు చేసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ నెల 15వ తేదీ పల్లె పండుగ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాల్లో ప్రారంభిస్తారని తెలిపారు.

**బాల్య వివాహాలను నియంత్రిద్దాం : ఎమ్మెల్యే**

**కళ్యాణదుర్గం** : బాల్య వివాహాల నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఇన్‌ఛార్జి ఆర్డీవో వినూత్న ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతంలో యువతకు విద్య, వసతి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని గుర్తుచేశారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు నియమించిన కమిటీ సభ్యులు అంకితభావంతో పని చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, సిడిపిఒ శ్రీదేవి, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అన్న క్యాంటీన్ ప్రారంభం**

పేదలకు నాణ్యమైన భోజనం అందించడమే టిడిపి లక్ష్యమని ఎమ్మెల్యే అమ్మిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను బుధవారం ఎమ్మెల్యే ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, అడిషనల్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఆర్డీవో వినూత్నతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కరణం రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, వెంకటేశులు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ వైపి.రమేష్ పాల్గొన్నారు.

**విద్యుత్ సబ్‌స్టేషన్లలో నిరుపేదలకు ఉద్యోగాలు**

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నియోజకవర్గంలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్లలో నిరుపేద కుటుంబాలకు చెందిన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారు. ఎమ్మెల్యే నిరుపేదలను గుర్తించి బ్రహ్మసముద్రం మండలంలోని రాయలప్పదొడ్డి సబ్‌స్టేషన్, శెట్టూరు మండలంలోని అనుంపల్లి, కళ్యాణదుర్గం మండలంలోని ముద్దినాయనపల్లి సబ్‌స్టేషన్లలో దాదాపు 15 మందికి ఉద్యోగాలు ఇప్పిం చారు. గతంలో ఇదే ఉద్యోగాలకు పెద్దఎత్తున వసూలు చేసే వారని, అయితే ఎమ్మెల్యే పారదర్శకంగా వ్యవహరించి ఉద్యోగాలు భర్తీ చేశారని ఆయా ఉద్యోగాలు పొందిన వ్యక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**


మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన టిడిపినేత ఓంకార్‌రెడ్డి

దసరా పండుగ పురస్కరించు కొని బుధవారం నగరంలోని ఆరో రోడ్డు సచివాలయంలో సచివాల య పరిధిలోని పారిశుధ్య కార్మికులకు టిడిపి యువనేత ఓంకార్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందికి నూతన దుస్తులు పంపిణీ చేశారు. అలాగే మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యుడు ఇస్మాయిల్ ఆజాద్, విజయ్ కుమార్, ఇబ్రహీం, నారాయణస్వామి, భాస్కర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'సేవాలాల్ చరిత్ర' పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి-గుత్తి**

బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ చరిత్ర పుస్తకాలను బుధవారం సేవాలాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న సేవాఘడ్‌లో జగన్మాతను బుధవారం సరస్వతిదేవిగా అలంకరించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఎఎస్ఎన్ మూర్తి ఆంగ్ల భాషలో ముద్రించిన సేవాలాల్ చరిత్ర పుస్తకాలను సరస్వతిదేవికి సమర్పించి అనంతరం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వర్కింగ్ అధ్యక్షులు రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్, కోశాధికారి బాలానాయక్, నాయకులు రాజేంద్ర ప్రసాద్ నాయక్, కృష్ణా నాయక్, భూక్యా వెంకటరమణ పాల్గొన్నారు.

సేవాలాల్ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

## నేడు అరవింద్ డయాబెటిస్ మల్టీ హాస్పిటల్ ప్రారంభం

**ప్రజాశక్తి-అనంతపురం**

డాక్టర్ జానకి అరవింద్‌కుమార్

నగరంలోని సాయినగర్ ఒకటో క్రాస్‌లో రామన్ స్కూల్ ఎదురుగా నూతనంగా నిర్మించిన అరవింద డయాబెటిస్ మల్టీ హాస్పిటల్ ఆసుపత్రిని గురువారం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ జానకి అరవింద్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా అమృత హాస్పిటల్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ప్రజల ఆదరణతో ఆధునిక వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తూ అధునాతన వసతులతో అరవింద్ డయాబెటిస్ మల్టీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆసుపత్రి సేవలను ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఘనంగా ఆశా డే

**ప్రజాశక్తి-యాడికి**

యాడికి, రాయలచెరువు పిహెచ్‌సిల్లో బుధవారం ఆశా డే ఘనంగా నిర్వహించారు. తాడిపత్రి సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆశా కార్యకర్తలు, సిబ్బందికి దోమల లార్వా నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పిహెచ్‌సి పరిధిలో ప్రతి రోజూ ఫీవర్ సర్వే సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పిహెచ్‌సి, ల్యాబ్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీరామ్ కుమార్, డాక్టర్ అప్పయ్య, సిహెచ్ఒ జుబేద, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సుమతీదేవి, సూపర్వైజర్లు షబ్బీర్, సరోజమ్మ, రాంప్రసాద్‌గౌడ్, సరితాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ శిరీష, సాయిలత, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన ఉద్యోగులు

**పుట్లూరు** : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పని చేసే సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ ఇంతియాజ్ బదిలీపై వెళ్లగా బుధవారం కె.రాజా బాధ్యలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా గ్రామ రెవెన్యూ అధికారులు టి.అంకన్న-కోమటికుంట్ల, వై.పెద్దన్న-కడవకళ్లు, ఎస్.రిజ్వాన-అరకటవేముల, పి.నాగభూష ణం-మడుగుపల్లి. ఎన్.శ్యామలదేవి-కందికాపుల వివిధ మండలాలకు బదిలీ అయ్యారు. కొత్తగా మండలానికి సి.రామకృష్ణ-అరకటవేముల, ఎన్.శివప్రసాద్-శనగల గూడురు, టి. రామాంజనేయులు-కోమటికుంట్ల, జె.వెంకటేశ్వరరావు-కందికాపుల, ఎన్.శ్యామలదేవి-కడవకల్లు, ఆషిక-మడుగుపల్లి సచివాలయాలకు బదిలీపై వచ్చారని తహశీల్దార్ శేషారెడ్డి తెలిపారు. నూతన ఉద్యోగులు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో వారి సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్ ఆదేశించారు

# నేరాలు ఘోరాలు

## చెక్‌డ్యాంలో పడి రైతు మృతి

**ప్రజాశక్తి-గుత్తి**

మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు బుధవారం ప్రమాదవశాత్తూ చెక్ డ్యాంలో పడి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. రైగు బోయ నాగరాజు(40) తన వ్యవసాయ పొలంలో పనులు చేయడానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి చెక్ డ్యాంలో పడిపోవడంతో నీట మునిగి మృతిచెందాడు. సమీప పొలాల్లో పని చేస్తున్న రైతులు గమనించి నాగరాజును బయటికి తీసి హుటాహుటిన గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

**ప్రజాశక్తి-గుత్తి**

మండలంలో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. పట్టణంలోని బస్టాండ్ నుంచి గాంధీ కూడలి వైపు వెళ్తున్న కారు ఓ వృద్ధుడిని తప్పించబోయి డివైడర్ ను ఢీకొని దానిపైకి ఎక్కింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వారు పట్టణంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే మండలంలోని వన్నేదొడ్డి గ్రామ సమీపంలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడగా చిన్నారులకు గాయాలయ్యాయి. కరీంనగర్‌కు చెందిన మోహన్‌కృష్ణ బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. అతడు కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు నుంచి కరీంనగర్‌కు కారులో వెళ్తుండగా వన్నేదొడ్డి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై టైరు పంచర్ అయింది. దీంతో రోడ్డు పక్కన ఆపి కారు టైరు మారుస్తుండగా వెనక వైపున బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మోహన్‌కృష్ణ భార్య శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. వారి పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండు ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## రేషన్ బియ్యం స్వాధీనం

**ప్రజాశక్తి-ఉరవకొండ**

పట్టణ సమీపంలోని హనుమాన్ నగర్ వద్ద మంగళవారం రాత్రి అక్రమంగా తరలించడానికి ఐచర్ వాహనంలో సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లత్తవరం తండా గ్రామానికి చెందిన దేవేంద్రనాయక్‌తో పాటు పిసి ప్యాపిలి గ్రామానికి చెందిన సాయికుమార్, శివశంకర్, కొనకొండ్ల గ్రామానికి చెందిన నారాయణస్వామి, భవనేష్‌లను అదుపులోకి తీసుకొని వారి నుంచి ఐచర్, ఆటోతో పాటు 68 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సురేష్‌బాబు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## ఇసుక టిప్పర్లు పట్టివేత

**ప్రజాశక్తి-శింగనమల**

మండలంలోని నాయనపల్లి క్రాస్ నుంచి అనంతపురానికి అక్రమం గా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు సిఐ కౌలుట్లయ్య తెలిపారు. అక్రమ ఇసుక రవాణా అవుతున్నట్లు సమాచారం రావడంతో కాపు కాచి టిప్పర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు శింగనమల సిఐ తెలిపా రు. మండలంలో ఇసుక ను అక్రమంగా రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి బాధ్యులను జైలుకు పంపుతామని సిఐ హెచ్చరించారు.

## గోనేహాల్ రేషన్‌షాపు సీజ్

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

మండలంలోని గోనేహాల్ గ్రామంలో ఉన్న ఓ రేషన్ షాపును బుధవారం అనంతపురం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో రికార్డుల్లో కంటే నిల్వ ఎక్కువ ఉందని, తూకాలు, కొలతలు సక్రమంగా లేవని, రికార్డులు సక్రమంగా రాయలేదని విజిలెన్స్ సిఐ జమల్‌బాషా, ఏవో బాబుప్ర సాద్ గుర్తించి షాపును సీజ్ చేశారు. రేషన్‌కార్డుదారుల ఫిర్యాదుల మేరకు షాపును తనిఖీ చేశామని అధికారులు తెలిపారు. బియ్యం పంపిణీ పూర్తయినా 4 క్వింటాళ్ల బియ్యం స్టాక్ ఉన్నాయని వాటిని కూడా సీజ్ చేశామని తెలిపారు.

**మహారాజశ్రీ గుత్తి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టు నందు, గుత్తి**
**ఓ.యస్. నెం:25/2023**

**Between:**
Nitturu Abdul & Others ...వాదులు
**And**
Oruganti Sreenath & Others ...ప్రతివాదులు

**5వ ప్రతివాదికి దావా సమన్లు**

**To,**
**5వ ప్రతివాది**
ఓరుగంటి పావని, W/o మూలా క్రిష్ణ మోహన్, D/o లేట్ ఓరుగంటి ఉపేంద్రనాథ్, R/o డోర్ నెం.12-1-622, M.R.S.కాంప్లెక్స్, అశోక్ నగర్, అనంతపురం పట్టణము, జిల్లా.

ఇందుమూలంగా మీకు తెలియజేయడం ఏమనగా వాదులు అనుబడువారు మీ మీద పై కోర్టులో మీ తండ్రిగారు మరియు 1 నుండి 3 ప్రతివాదులు వ్రాయించి ఇచ్చిన దావా షెడ్యూలు దాఖల ఆస్తికి సంబంధించి విక్రయ అగ్రిమెంటు తేది:21-05-2018అమలు చేయటలో విఫలమై ఉన్నందున, వాదులు సదరు అగ్రిమెంటు నందు చెల్లించిన మొత్తమును రాబటుట్టకొనుటకు దావా దాఖలు చేసి యున్నారు.సదరు దావా నందు మీరు దావా సమన్లు తీసుకొనకుండా ఆలస్యం చేయుచున్నారు. కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు దావా సమన్లను దినపత్రిక ద్వారా జారీ చేయుటం జరిగినది. కావున మీరు 23-10-2024వ తేదిన ఉదయం 10-00 గంll స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు యెదుట తప్పక హాజరై మీరు మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలసి ఉన్నది. లేని యెడల మీ పరోక్షము నందు కోర్టు వారిచే దావాను తీర్మానము చేయడం జరుగును.

**దావా అగ్రిమెంటు ఆస్తి వివరము**
Property situated within RD of Ananthapuramu and SRD of Gooty in Gooty Village fields within Gooty Municipality.
**Govt.** Dry **Sy.No.** 412/3 **Extent A.C.** 3-07 cents out of this **A.C.** 0-69 cents out of this **A.C.** 0-11 1/2 cents.
**Bounded by:**
**EAST:** Gooty-Ananthapuramu road
**WEST:** Land in S.No. 412/2
**NORTH:** Land of Achchayya Gupta
**SOUTH :**Plots of Lakshmaiah

(కోర్టు వారి ఉత్తరువు మేరకు)

ఇట్లు,
**బి.సుదర్శన్ రెడ్డి**,
వాదిపరం వకీలు, గుత్తి.

**మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**
**O.S.NO:58/2012**

**Between:**
D.L.నారాయణరావు డైడ్ బై లీగల్ రెప్రెజెంట్‌టిటివ్స్ ద ప్లైంటివ్స్ 2 to 9 ...వాదులు
**V/S**
M.అన్నపూర్ణదేవి డైడ్ బై లీగల్ రెప్రెజెంట్‌టిటివ్స్ ద డిఫెండెంట్స్ 4 to 10 ...ప్రతివాదులు

**4వ ప్రతివాదికి దావా నోటీసు**

పై దావాలో 4వ ప్రతివాది అయిన శ్రీమతి జి.క్రిష్ణ కుమారి W/o జి.యస్.ప్రసాద్, రిటైర్డ్ బ్యాంక్ ఎంప్లాయి, నివాసము డోర్ నెం.28/843,opp: పబ్లిక్ పార్క్, సంగమేష్ నగర్, అనంతపురం టౌన్, అనంతపురం జిల్లా.

ఇందుమూలముగా తెలియజేదయడం ఏమనగా పై దావాలో మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 24/10/2024వ తేదికి వాయిదా వేసినారు. కావున సదరు వాయిదా తేదిన ఉదయం 10:30 గంటలకు మీరు గానీ మీ వుత్తర్వులు పొందిన వకీలు ద్వారా గాని తప్పని సరిగా హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:24/10/2024
స్థలం:కదిరి

కె.సుబ్బరాజు గుప్తా, బి.ఎస్.సి, బి.ఎల్,
వాదులపరం న్యాయవాది, కదిరి.

# గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

గుంతకల్లులో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ విజయలక్ష్మి

## పంచాయతీ పరిపాలనపై వైస్ సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ

**ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్**

పంచాయతీ కనీస పరిపాలనపై బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వైస్ సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. డిఎల్‌డిఒ విజయలక్ష్మి, ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరి మాట్లాడుతూ పారిశుధ్యం నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, వీధి దీపాలు, విద్యుత్ బకాయిల చెల్లింపు, తదితర ఆర్థిక వ్యవహారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలుపై చర్చించే అధికారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగభూషణ, పంచాయతీ కార్యదర్శు లు, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం వైస్ సర్పంచులు, వార్డు మెంబర్లకు పంచాయతీ పరిపాలనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మీనరసింహ గ్రామ అభివృద్ధి, పరిపాలన, గ్రామసభల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాలు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్ర, కార్యదర్శులు, వైస్ సర్పంచులు,వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

**నార్పల :** గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎంపిడిఒ గంగావతి, ఈవోఆర్డీ శైలజరాణి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డ్ మెంబర్లకు పంచాయతీ పరిపాలనపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో, ఈవోఆర్డీలు మాట్లాడుతూ గ్రామం అభివృద్ధిలో సర్పంచి, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కీలకమన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు ఉన్నా పరిష్కరించాలన్నారు.సర్పంచి అధికారులు, పాలకవర్గం అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. కార్యక్రమంలో శిక్షకులు శ్రీనివాసులు, వెంకటరమణ, వివిధ గ్రామ పంచాయతీల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైస్ సర్పంచి, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో అలివేలమ్మ మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని గ్రామాల అభివృద్ధి, పరిపాలన, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ జిలాన్‌బాషా, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

**పామిడి :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డ్ మెంబర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో తేజోశ్న, ఈవోఆర్‌డి కృష్ణకుమార్ గ్రామాభివృద్ధిలో సర్పంచి, ఉప సర్పంచి, వార్డు సభ్యుల పాత్రను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామ పంచాయతీల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**శింగనమల :** ప్రజలందరి సహకారంతోనే గ్రామపంచాయతీల అభివృద్ధి జరుగుతుందని ఎంపీడీవో నిర్మలకుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో మౌలిక వసతులు, వనరులు, ఆదాయం, నిధుల లభ్యత, తదితర అంశాలపై ప్రజల ప్రాధాన్యత ప్రకారం నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది అన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటలక్ష్మమ్మ, కార్యదర్శులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

**ఉరవకొండ :** గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమైందని ఎంపీడీవో రవిప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన రిఫ్రెషర్ కార్యక్రమంలో భాగంగా ఉప సర్పంచి, వార్డు సభ్యులకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ తరగతులను ఎంపీడీవో ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ నిధుల వినియోగం తదితర 9 అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతులకు రీసోర్స్ పర్సన్లుగా కార్యదర్శులు మహేష్, రమణ కుమార్, వెంకటేశులు వ్యవహరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**బెళుగుప్ప :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ అధ్యక్షతన వైస్ సర్పంచులు, పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిపాలన, పంచాయతీ రాజ్ చట్టం నిబంధనలు, తదితర విషయాలపై వివరించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి నాగేశ్వర శాస్త్రి పాల్గొన్నారు. శిక్షకులుగా పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, శంకర్, జగదీష్, శివరంజని వ్యవహరించారు. కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ రవికుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**గార్లదిన్నె :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో యోగానందరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సర్పంచి, ఉప సర్పంచులతో పాటు వార్డు మెంబర్లు భాగస్వాములు కావాలన్నారు. వార్డు మెంబర్లు తమ వార్డు పరిధిలో ఉండే సమస్యలను సర్పంచి దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించాలన్నారు.

**యల్లనూరు :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వాసుదేవర రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు, ఉప సర్పంచ్‌లకు పంచాయతీల అభివద్ధిపై శిక్షణ తరగతులను నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. మౌలిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

ప్రొ॥జివి. రమణను సత్కరిస్తున్న అవని ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

## ప్రొ॥జివి.రమణకు దసరా పురస్కారం

**ప్రజాశక్తి-అనంతపురం**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జివి.రమణకు దసరా పురస్కారం లభించింది. అవని వారధి ఛారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ సమాజ సేవ చేస్తున్న వారికి దసరా పురస్కారాన్ని ప్రతి ఏటా అందిస్తారు. అందులో భాగంగా వివిధ రంగాల్లో చేస్తున్న సేవలకు గాను జివి.రమణను పురస్కారానికి ఎంపిక చేసింది. పురస్కారం అందుకున్న ప్రొఫెసర్‌ను ప్రముఖ కాలమిస్ట్, సామాజికవేత్త, ఎన్‌ఆర్ఐ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నల్లాని రాజేశ్వరి అభినందించారు.

## ఫ్యాక్షన్ గ్రామాల్లో సిఐ పర్యటన

**తాడిపత్రి రూరల్ :** మండలంలోని ఫ్యాక్షన గ్రామాల్లో బుధవారం రూరల్ సిఐ శివ గంగాధర్ రెడ్డి పర్యటించారు. సమస్యాత్మక గ్రామాలైన వీరాపురం, బోడాయిపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పోలీస్ పికెట్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లోని తాజా పరిస్థితుల గురించి అడిగి తెలుసు కున్నారు. ఘర్షణలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు సూచించారు.

## సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

మండలంలోని పి.యాలేరు గ్రామంలో కొందరు సచివాలయ ఉద్యోగులు ఏమాత్రం సమయ పాలన పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఆ సచివాలయంలో బుధవారం ఉదయం చాలా కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడమే ఇందుకు నిదర్శనం. 11 గంటలు దాటినా గ్రామ కార్యదర్శి, డిజిటల్, వెటర్నరీ అసిస్టెంట్లు, ఎఎన్ఎం తప్ప ఏ ఉద్యోగి హాజరు కాలేదు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉదయం 11 గంటలైన కార్యాలయంలో కన్పించని సిబ్బంది

## అనంతలో టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం

**అనంతపురం కలెక్టరేట్ :** అనంతపురం అర్బన్ నియోజకవర్గంకు సంబంధించి టిడిపి సభ్యత్వ నమోదును బుధవారం ప్రారంభించారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఆధ్వర్యంలో 43వ డివిజన్ సాయిబాబా ఆలయం వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ సరళ, 45,46,47వ డివిజన్ల ఇన్‌ఛార్జులు పిఎల్‌ఎన్.మూర్తి, దలవాయి వెంకటనారాయణ, దలవాయి వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వయంగా సభ్యత్వ నమోదును తీసుకున్నారు. అనంతరం కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదు తీసుకున్నారు. టిడిపి సభ్యత్వ నమోదు తీసుకోవడం గర్వకంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల ముందు పార్టీ కోసం పని చేసిన వారందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి, గాజుల ఆదెన్న, తలారి ఆదినారాయణ, రాయల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## రచ్చుమర్రి స్టాక్ యార్డ్‌లో ఇసుక నిల్వలు

**కళ్యాణదుర్గం రూరల్ :** రెవెన్యూ డివిజన్ పరిధిలోని కణేకల్ మండలం రచ్చుమర్రి ఇసుక స్టాక్ యార్డ్‌లో 13,280 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని ట్రైనీ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఆర్డీవో వినూత్న తెలిపారు. ఇసుక కావలసిన లబ్ధిదారులు AP Sand Management portal - sand.ap.gov.inలో ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసుకుని ఆపరేషన్ కాస్ట్ రుసుముతో ఇసుకను పొందవచ్చని తెలిపారు.

## ఐఎంఎ జిల్లా కార్యవర్గం ఎన్నిక

**అనంతపురం :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ టి.మురళీకృష్ణ, కార్యదర్శిగా డాక్టర్ సి.నిరంజన్ రెడ్డి, ట్రెజరర్‌గా డాక్టర్ జివి.సుప్రజాచౌదరి, వైస్ ప్రెసిడెంట్లుగా డాక్టర్ పి.ప్రసూన, డాక్టర్ వాల్మీకి శ్రీనివాస్, డాక్టర్ అభిషేక్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ రవిశ్రీనివాస్, డాక్టర్ భానుకిరణ్, డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఏడాది పాటు సేవలు అందిస్తుంది. ఎన్నికల అధికారులుగా డాక్టర్ కె.కొండయ్య, డాక్టర్ జె.శ్రీనాథ్ వ్యవహరించారు.

## నేడు ప్రత్యేక ఆధార్ క్యాంప్

**పుట్లూరు :** తపాలా శాఖ వారోత్సవాలు సందర్భంగా గురువారం మండలంలోని కడవకల్లు గ్రామంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవడం, తదితర సేవలు అందిస్తామన్నారు. నూతన ఆధార్ కార్డు నమోదును ఉచితంగా చేసుకోవచ్చన్నారు. అలాగే తపాలా శాఖలోని పలు రకాల సేవలను ప్రజలు వినియోగించుకోవచ్చని తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం

**అనంతపురం :** నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు మళగవేలి లక్ష్మీరెడ్డి జన్మదినం సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో 200 మందికి అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు నిర్మలమురళి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సౌధామణి, సుబ్రహ్మణ్యం, ఓబుళపతి, రవికుమార్, మణిదీప్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద హమాలీ యూనియన్ ఆఫీస్ పైకప్పు నిర్మాణం

**ఉరవకొండ :** మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల సహకారంతో పట్టణంలోని పెద్ద హమాలీ యూనియన్ ఆఫీస్ పైకప్పు నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు ఆ యూనియన్ నాయకులు తెలిపారు. పట్టణంలో బుధవారం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మంత్రి పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు శ్రీనివాసులు హమాలీ యూనియన్ ఆఫీస్ పాత స్లాబ్‌ను తీసివేయించి కొత్త స్లాబ్ వేయించారన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ ముష్టూరు బాషా, వార్డ్ మెంబర్ రామాంజనేయులు, మీనుగ పెద్దన్న, బూత్ కన్వీనర్ చిన్నమాదుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి

**గుత్తి :** రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడిన సాధిస్తారని రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.లక్ష్మణ్, డాక్టర్ జాహ్నవి, ఏవో ముస్తాక్ అహ్మద్ తెలిపారు. వారు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని శ్రీపురం గ్రామంలో పంట పొలాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ పొలాల్లోకి చేరిన వర్షం నీటిని తొలగించాలన్నారు. అలాగే పంట యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ జగదీష్, రైతులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో ప్రభాకర్ నాయక్‌కు సత్కారం

**గుత్తి :** నూతన ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్‌ను బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పలువురు సన్మానించారు. చెర్లోపల్లి సర్పంచి ఎ.వెంకటేష్, ఎంపీటీసీ చిన్న ఈరన్న గౌడ్ ఎంపీడీవోకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివిలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**శింగనమల :** స్థానిక కెజిబివిలో ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని విద్యా శాఖ అధికారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఇఒ కార్యాలయంలో ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

## నూతన ఎంపిడిఒను కలిసిన సర్పంచులు

**నార్పల :** మండల నూతన ఎంపిడిఒ గంగావతిని బుధవారం మండలంలోని పలు గ్రామ పంచాయతీల సర్పంచులు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో సిద్ధిరాచర్ల, గుంజేపల్లి, గంగనపల్లి, బండ్లపల్లి సర్పంచులు రామాంజనేయులు, రాంభూపాల్‌రెడ్డి, కుళ్లాయిరెడ్డి, వెంకటనారాయణమ్మ తదితరులు ఎంపిడిఒ గంగావతిని కలిసి వారి వారి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సమస్యలు, తదితర అంశాలను ఎంపిడిఒకు వివరించారు.